## కాస్మోటిక్ చార్జీలు పెంచాలి..

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 10: రాష్ట్రంలోని కేజీబీవీ హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ, సంక్షేమ హాస్టల్స్, గురుకుల విద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులే చదువుకుంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం వల్ల టీచర్లు, వార్డెన్లు, ప్రైవేట్ కాంట్రాక్టర్ల ఆగడాలు పెరిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాలయాల్లో వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.

## తాగునీటి నాణ్యత పరిశీలన..

ఎస్‌పీఆర్ హిల్స్ సెక్షన్‌లో తాగునీటి నాణ్యతను పరిశీలిస్తున్న మేనేజర్ రాజేందర్ నాయక్

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 10: వర్షాలతో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని జలమండలి జనరల్ మేనేజర్ ఎస్.హరిశంకర్.. అధికారులను ఆదేశించారు. డివిజన్-6 పరిధిలోని అన్ని సెక్షన్‌లలో విధిగా తాగునీటి నాణ్యత ను పరిశీలించాలని సూచించారు. ఈ మేరకు ఎస్‌పీఆర్ హిల్స్ సెక్షన్ పరిధిలో తాగునీరు సరఫరా అవుతున్న సమయంలో మేనేజర్ రాజేందర్ నాయక్ ఇంటింటికి వెళ్లి తాగునీటి నాణ్యతను పరిశీలించారు.

హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

జవహర్‌నగర్ కూడలి వద్ద ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తదితరులు

# ధీర వనిత చాకలి ఐలమ్మ

## పలు ప్రాంతాల్లో ఐలమ్మకు ఘన నివాళి..

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 10: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృతంగా కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో భూ పోరాటానికి నాంది పలికిన ధీర వనిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఐలమ్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ పాల్గొని రజాకార్లను గడగడలాడించారని.. ఆ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించి హిందూ, ముస్లింల మధ్య ఉన్న ఐక్యతను దెబ్బతీ సేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం గుర్తించి అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ సాయిల్‌గౌడ్, రాష్ట్ర నాయకులు అంజయ్యనాయక్, మారుపాక అనిల్‌కుమార్, సహదేవ్, మహాలక్ష్మి, బొడ్డుపల్లి కృష్ణ, కృష్ణమూర్తి, రచ్చ కిషన్, గిరిజ, హైమావతి, విజయలక్ష్మి, సదాలక్ష్మి, యాదయ్యగౌడ్, కృష్ణ, జంగయ్య, నరేంద్రచారి పాల్గొన్నారు.

### ఐలమ్మ కృషి మరవలేనిది..

వెంగళరావునగర్ : భూస్వామ్య వ్యవస్థ పై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం జవహర్‌నగర్ కూడలి వద్ద జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ కృషి మరవలేనిదని, మహిళల్లో చైతన్యం నింపిన ధీర వనిత ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జకియా సుల్తానా, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి, వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, రజక సంఘం నాయకులు రాజు రజక, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు విజయ్ ముదిరాజ్, అంబటి రామకృష్ణ, వేణుగోపాల్, శ్యామ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

**మైలార్‌దేవ్‌పల్లి:** వీరనారి చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని హక్కులను సాధించుకోవాలని బీఆర్ఎస్ నాయకులు, లక్ష్మీగూడ రజక సంఘం సభ్యులు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా డివిజన్ పరిధిలోని శివాజీ చౌక్ వద్ద లక్ష్మీగూడ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లక్ష్మీగూడ గ్రామంలో రజకుల కోసం ధోబీఘాట్, చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడలేదన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మైలార్‌దేవ్‌పల్లి శివాజీ చౌక్ వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, లక్ష్మీగూడ రజక సంఘం సభ్యులు

### శంషాబాద్ మండలంలో..

శంషాబాద్ రూరల్ : చాకలి ఐలమ్మను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని శంషాబాద్ మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకురాలు దిద్యాల జయమ్మశ్రీనివాస్ సూచించారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని పెద్దతూప్ర గ్రామంలో రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు దిద్యాల శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహ, సహకార సంఘం డైరెక్టర్ గౌతమ్, నాయకులు అంజయ్య, అశోక్, నారాయణ, కుమార్, స్వామి, బలవంత్‌రెడ్డి, శంకరయ్య, ఆంజనేయులతో పాటు పలువురు పాల్గొన్నారు. దీంతో పాటు పాలమాకుల గ్రామంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.

శంషాబాద్ మండలం, పెద్దతూప్ర గ్రామంలో ఐలమ్మ వర్ధంతిలో మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, తదితరులు

### శంషాబాద్ మున్సిపాలిటీలో

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధాంతి సమీపంలోని దోబీఘాట్ వద్ద కౌన్సిలర్ ఆయిల్ కుమార్ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మంచినీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి

మణికొండ మున్సిపాలిటీ వాటర్‌బోర్డు మేనేజర్ అధికారులను సన్మానిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి , తదితరులు

మణికొండ, సెప్టెంబర్ 10: మణికొండ మున్సిపాలిటీలో మంచినీటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ జలమండలి మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారెడ్డితోపాటు జనరల్ మేనేజర్ మహేందర్‌నాయక్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేశ్ రావులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటిని అందించాలన్నారు. పైపులైన్ల మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, వసంత్ చౌహాన్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరాములు, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, నాయకులు ఏర్పుల కుమార్, శ్రవణ్, గంగాధర్, ఆరీఫ్, రాజేశ్, శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 10: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మంజూరైన పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా అవసరం ఉన్న చోట పనులను తక్షణమే చేపట్టాలన్నారు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రధానంగా డ్రైనేజీ, సీసీ రోడ్లు, బాక్స్ డ్రైన్ పనులు, నాలాల సుందరీకరణ తదితర వాటిని చేపట్టాలన్నారు. కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించి పూర్తి చేస్తే ప్రజల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయన్నారు. ప్రజలు అనేక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. పక్కా ప్రణాళికతో వీటిని పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మధుసూదన్ రెడ్డి, ఏఈ నర్సింహ్మమూర్తి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## వర్ష బాధితులను ఆదుకోవడానికి విరాళాల సేకరణ

కాటేదాన్‌లో వర్ష బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 10: అకాల వర్షాలకు నష్టపోయిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు విరాళాలను సేకరిస్తున్నామని రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు జి.కురుమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్‌లు అన్నారు. ఈ మేరకు మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, కాటేదాన్ ప్రాంతంలో మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మం, విజయవాడలలో అకాల వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడానికి తమవంతు బాధ్యతగా విరాళాలను సేకరిస్తున్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేయాలన్నారు. ఎలాంటి ఘటనలు జరిగినా స్పందిస్తూ మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అకాల వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సోమల నాయక్, మన్యం రవికుమార్, కేశవులు, శేఖర్, కొండయ్య, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో..

తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మంగళవారం వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణకు ఫైట్ మాస్టర్ రామ్‌లక్ష్మణ్ వద్దకు వెళ్లగా.. ఆయన తమ వంతు సహాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. – మణికొండ, సెప్టెంబర్ 10

## ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలి

తనిఖీలో పట్టుకున్న ఆటోలతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 10: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం దుర్గానగర్ చౌరస్తాలో ప్యాసింజర్ ఆటోల తనిఖీల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో చాలా మంది ఆటో డ్రైవర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అలాంటి 15 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఎస్సై రాజేందర్, ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ సురేశ్, చిరంజీవి, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## సన్మానం

టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం కలిసి శాలువా కప్పి సన్మానిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ – మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 10

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 10 : పుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఖైరతాబాద్ ఏఎస్సై శ్రీరాములు వివరాల ప్రకారం...లక్డీకాపూల్‌లోని టెలిఫోన్ భవన్ వెళ్లే దారిలో ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ షాపు ముందు పుట్‌పాత్‌పై ఓ వ్యక్తి(45)వి గతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## స్పా సెంటర్లపై పోలీసుల దాడి

హిమాయత్‌నగర్,సెప్టెంబర్10: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రెండు స్పా సెంటర్లపై నారాయణగూడ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌గూడలోని ఆరోరా వెల్నెస్‌స్పా, హిమాయత్ నగర్‌లోని ది మాంక్ స్పా సెంటర్లపై ఎస్సైలు షఫీ వెంకటేశ్వర్ల నేతృత్వంలో మంగళవారం ఆకస్మికంగా దాడులు చేసి రెండు స్పా సెంటర్ల మేనేజర్లను అదుపులోకి తీసుకున్నారు. స్పా సెంటర్లకు వచ్చే కస్టమర్ల వివరాలను రిజిస్టర్‌లో సక్రమంగా నమోదు చేయకపోవడం, క్రాస్ మసాజ్,లైటింగ్‌లేకపోవడం, శిక్షణ పొందిన వారు కాకుండా ఇతరులతో మసాజ్ చేయడం వంటి లోపాలను గుర్తించినట్లు తెలిపారు.

# బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 10: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వాడవాడలా గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్నారు. బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో కొలువుదీరిన వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తున్నారు. అలాగే అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

- **శంషాబాద్ రూరల్ :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కొలువుదీరిన వినాయకులకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని మధురానగర్, ఆర్బినగర్, ఆదర్శనగర్, సిద్ధాంతి, పాత శంషాబాద్‌లోని వివిధ వాడల్లో వినాయకుడికి పూజలు చేయడంతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. అలాగే.. మండలంలోని నర్కూడ, సుల్తాన్‌పల్లి, కవ్వగూడ, చౌదర్‌గూడ, పెద్దషాపూర్, జూకల్, పాలమాకుల, శంకరాపూర్, ఘాన్సిమియాగూడ, చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ గ్రామాల్లో పూజలు నిర్వహిస్తున్నారు.



శంషాబాద్ మండలం చౌదర్‌గూడలో వినాయకుడి పూజలో యువకులు

లక్ష్మీగూడలో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న మహేందర్, తదితరులు

రహ్మత్‌నగర్, సంజయ్‌నగర్‌లో మణికంఠ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడి మండపం వద్ద అన్నదానంలో వడ్డిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి – జూబ్లీహిల్స్

యూసుఫ్‌గూడ డివిజన్‌లోని వినాయక మండపంలో యూత్ సభ్యులతో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ – జూబ్లీహిల్స్

మణికొండ నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి పూజలో మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి తదితరులు – మణికొండ,సెప్టెంబర్ 10

యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేశ్ మండపంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో నిర్వాహకులు ప్రేమ్ కుమార్, మానిక్ ప్రభు, సురేందర్, రాకేశ్, పవన్ కుమార్, సుమన్ తదితరులు – జూబ్లీహిల్స్,సెప్టెంబర్10

గణనాథుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజల్లో పాల్గొన్న మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి , తదితరులు. –మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 10

## మద్యం మత్తులో యువకుడు వీరంగం

- పోలీసుల తనిఖీలో పట్టుబడినందుకు బెదిరింపు
- ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 10 : ఓ యువకుడు మద్యం మత్తులో బైక్‌పై వేగంగా రావడమే కాకుండా.. పోలీసుల తనిఖీలో పట్టుబడినందుకు చనిపోతానంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన మంగళవారం శంషాబాద్ మండలంలోని తొండుపల్లి టోల్‌గేట్ వద్ద జరిగింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అతివేగంగా మద్యం మత్తులో ఓ యువకుడు ద్విచక్రవాహనంపై వచ్చాడు. అతడిని చెక్ చేయగా మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించి బైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. దీంతో సదరు యువకుడు తనకు బండి ఇవ్వాలని..లేకపోతే చనిపోతానంటు పోలీసులను భయపెట్టాడు. దీంతో పాటు రోడ్డుపై పరుగులు తీయడం, ఇతర వాహనాలకు అడ్డుగా వెళ్లడం చేశాడు. అనంతరం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108లో శంషాబాద్ పట్టణంలోని ఓ ప్రైయివేట్ దవా ఖానకు తరలించారు. అతడిని నాగర్‌కర్నూల్ ప్రాంతానికి చెందిన శివగా గుర్తించారు. గతంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసులో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సదరు యువకుడి ఆరోగ్యం నిలకడగా ఉందని ట్రాఫిక్ సీఐ రాజు తెలిపారు.

## బీటీ వేసిన ఆరు నెలలకే కుంగిన రహదారి

బండ్లగూడ, సెప్టెంబర్ 10: అధికారుల నిర్లక్ష్యం, నాణ్యత లోపం కారణంగా బీటీ రోడ్డు వేసిన ఆరు నెలలకే కుంగిపోయింది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ నుంచి దర్గా ఖలీజ్‌ఖాన్‌కు వెళ్లే దారిలో బీటీ రోడ్డును పలు దఫా దఫాలుగా వేశారు. మొదటిసారి చేపట్టినప్పుడు మ్యాన్‌హోల్స్‌లు సక్రమంగా అమర్చకపోవడంతో వాహనదారు లు ప్రమాదాలకు గురైన విషయం తెలిసిందే.

రెండవసారి రోడ్డు వేసి 6 నెలలు కూడా గడవక ముందే రోడ్డు కుంగిపోయింది. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వేసిన కొద్ది రోజులకే రహదారులు కుంగిపోవడంతో అధికారుల నిర్లక్ష్యం నిండుగా కనిపిస్తుందని వారు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి.. మ్యాన్‌హోళ్లను కూడా సక్రమంగా అమర్చాలని కోరుతున్నారు.